నేటి దినపత్రిక
సూర్య
ఉత్తరాంధ్ర
www.suryaa.com
శుక్రవారం
22-11-2024
పేజీలు 4
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం



మత్స్య సంపద కలుషితం చేయొద్దు..!

- భావి తరాలకు ఈ సంపద అందించాల్సిన బాధ్యత ఉంది
- మత్స్యకార దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- ఘనంగా మత్స్యకార అవగాహన కార్యక్రమం

విశాఖపట్నం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

సముద్రంలో ఉన్న మత్స్య సంపదను కలుషితం చేయకుండా కాపాడుతూ, అభివృద్ధి చేసుకుంటూ భావి తరాలకు మత్స్య సంపదను అందించే విధంగా మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం భారతీయ మత్స్య పరిశోధన సంస్థ, విశాఖపట్నం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మత్స్యకార అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సముద్ర మత్స్య సంపద పరిరక్షణ, నిర్వహణ, సాంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధి కాపాడుట మొదలగు అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు, సముద్ర కాలుష్యం వల్ల మత్స్య సంపద నశించుట తదితర అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లాలో 32 తీర గ్రామాలు ఉండగా, 15 ఫిష్ లాండింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మత్స్యకార బోట్లకు 100 శాతం సబ్సిడీతో ట్రాన్స్ పాండర్ లను అందజేయడం జరుగుతుందన్నారు. సుమారు 178 కోట్ల రూపాయలతో ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఫిష్ స్టాళ్లను ఏర్పాటు చేయడం, చేపల రవాణా వాహనాలు, ఫిష్ కేజ్ కల్చర్ యూనిట్స్ ను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బోట్లు ఫిట్నెస్ ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని మత్స్యకారులకు సూచించారు. ఇందువల్ల సముద్రంలో అనేక ప్రమాదాలను నివారించుకోవచ్చని తెలిపారు. పనికిరాని వలలను, ఇతర వ్యర్థాలను సముద్రంలో వేయకూడదని మత్స్యకారులకు సూచించారు. మెరైన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రవివర్మ మాట్లాడుతూ సముద్ర తీరప్రాంత పరిరక్షణకు మత్స్యకారుల సహకా రం ఎంతైనా అవసరం అన్నారు. అదేవిధంగా రింగ్ వలలు, ఇతర సమస్యలు ఏమైనా

మిగతా 2లో

రైల్వేలో ఆగని సీబీఐ దాడులు...!

మొన్న మెకానికల్.. నిన్న ఇంజనీరింగ్.. నేడు అకౌంట్స్
-ఏ రోజు ఏ విభాగంలో దాడులు చేస్తారోనన్న భయంలో విభాగాధిపతులు -కీలక ఫైళ్లు... డాక్యుమెంట్లు సీబీఐ చేతిలోనే..
-అల్లాడి పోతున్న దీర్ఘకాల ఉద్యోగులు

విశాఖపట్నం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

విశాఖ కేంద్రంగా ఉన్న వాల్తేరు రైల్వేలో ఇటీవల సీబీఐ రేపిన అలజడి ఏ మాత్రం తగ్గడం లేదు. గత మూడు రోజులుగా వరుసగా పలు విభాగాలపై సీబీఐ అధికారులు దాడులు చేస్తూనే ఉన్నారు. వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ఇటీవల సీబీఐకి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయిన సంగతి తెలిసిందే. అయితే అప్పటి నుంచీ సీబీఐ అధికారులు విశాఖ రైల్వేపై పట్టు బిగించారు. అవినీతికి ఆస్కారమిచ్చిన ఏ అధికారినీ వదలకుండా అందరినీ సాక్ష్యాలతో పట్టుకుని మరీ శిక్షించేందుకు కసరత్తు తీవ్రతరం చేశారు. అందుకు అవసరమైన అన్ని మార్గాలను వదలడం లేదు. ఈ మొత్తం అవినీతి వ్యవహారానికి కేంద్రమైన వాల్తేరు డీఆర్ఎం కార్యాలయంలో అవసరమైన... అవసరం అనుకున్న అన్ని ఫైళ్లను సేకరించే పనిలో పడ్డారు. ఇప్పటి వరకూ మెకానికల్.. ఇంజనీరింగ్.. విభాగాలకు చెందిన కాంట్రాక్టు ఫైళ్లన్నింటినీ సీబీఐ అధికారులు పట్టుకుపోయారు. గురువారం కీలకమైన అకౌంట్స్ విభాగంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ కీలకమైన ఫైళ్లను సేకరించారు. అకౌంట్స్ విభాగం నుంచే అసలు లెక్కలు తీసే పనిలో కేంద్ర నిఘా వర్గాలున్నాయని అంటున్నారు. గతంలో ఏ పనికి ఎంత ఖర్చులు అయ్యేవో ఆ లెక్కలు తాజా లెక్కలతో పోల్చి చూస్తున్నారు.

పాత కొత్త లెక్కల గణాంకాలను లోతుగా అధ్యయనం చేసే పనిలో కేంద్ర అధికారులున్నారని అంచనా వేస్తున్నారు. ఈ నెలాఖరు వరకూ కూడా ఈ సీబీఐ దాడులు జరిగేలా ఉన్నాయని భావిస్తున్నారు. ఇక నుంచి అన్ని శాఖల్లోనూ ఒక రోజు అటూ ఇటూగా అయినా సీబీఐ సోదాలు జరగడం ఖాయమని అంటున్నారు. అందుకు అన్ని శాఖల విభాగాధిపతులు అందుకు సమాయత్తంగా ఉండాలని మౌఖిక ఆదేశాలు సైతం జారీ అయ్యాయని బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. గత డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి ఉన్నప్పుడే కొందరు కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారని అప్పట్లోనే ఆయా కాంట్రాక్టర్లను మినహాయించేందుకు భారీగానే ఒప్పందాలు సైతం జరిగినట్టు పుకార్లు రేగుతున్నాయి. ఈ లోగా ఆయన బదిలీ అయిపోవడంతో అక్కడితో ఆగిన కాంట్రాక్టర్లు తిరిగి సీబీఐకి పట్టుబడ్డ సౌరభ్ ప్రసాద్‌ను ప్రసన్నం చేసుకునేలా ప్రోత్సహించిన డీఆర్ఎం పోటోకాల్ అధికారులపై కూడా తాజాగా సీబీఐ దృష్టి సారించింది. వారి కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేయడంతో పాటు వారి ఆస్తుపాస్తుల జాబితాను తీసే పనిలో ఉన్నట్టు తెలుస్తోంది.

పెండింగ్ రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

వాటర్ ట్యాక్స్ వసూలు చేయాలి :జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ఆయన గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలు, ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికకు వచ్చే అర్జీలలో పెండింగ్ లో ఉన్న అర్జీలు, లోకాయుక్త, కోర్టు కేసులు, వాటర్ ట్యాక్స్, నాలా, రీ సర్వే, ఆర్ ఓ ఆర్, సివిల్ సప్లయ్స్, తదితర అంశాలపై ఆయన మండలాల వారీగా సమీక్షించారు. పెండింగులో ఉన్న రెవెన్యూ సమస్యలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాక్స్ అంతా పరిశీలించి ట్యాక్స్ వసూలు చేయాలని ఆదేశించారు. ట్యాక్స్ వసూలు చేసేందుకు సిబ్బంది అవసరం ఉంటే తెలియజేయజేస్తే డిజిటల్ అసిస్టెంట్ ను ఇస్తామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు వెళితే సమస్యలు పరిష్కరించాల్సిన సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించవచ్చని తెలిపారు. ఉచిత ఇసుకపై సమస్యలు ఉంటే తక్షణమే ఆపాలన్నారు. ఎక్కడపడితే అక్కడ ఇసుక తీయడానికి అవకాశం లేదని విఆర్ఓ కు తెలియజేయాలని, వాటర్ సోర్సెస్ దగ్గర, వంతెనలు వద్ద, రాత్రి పూట తీయకూడదన్నారు. ఎన్.జి.టి. నిబంధనలు అతిక్రమించకూడదన్నారు. సీజ్ చేసిన ఇసుక ఎక్కడైనా ఉంటే తెలపాలని కలెక్టర్ చెప్పగా గార, ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో ఉన్నట్లు తహసీల్దార్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాలు మరమ్మతులు ఉంటే తెలపాలని అడుగగా మరమ్మతులు ఉన్న తహసీల్దార్ కార్యాలయాలు అంచనా వ్యయం పంపాలని

మిగతా 2లో

డిసెంబర్ 2 నుంచి 30 వరకు

'కనకమ్మ' అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు

విశాఖపట్నం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

డిసెంబర్ 2 నుంచి 30వ తేదీ వరకు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం పరిధిలో జరగనున్న మార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో పలు అంశాలపై ఆయన మార్గదర్శకాలు జారీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. చైన్ స్నాచింగ్‌లు, ఇతర దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రతి గురువారం ఏవీఎన్ కళాశాల దిగువ నుంచి వాహనాలు దారి మళ్లించుట, శుక్ర, శనివారాల్లో టౌన్ కొత్త రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు వరకు ట్రాఫిక్ మళ్లించాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా సరిపడా క్యూలైన్లు, మంచినీటి సదుపాయం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ఎక్కడికక్కడ డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పోలీసు శాఖ సూచనల మేరకు అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని ఆలయ అధికారులను ఆదేశించారు. నిత్యన్నదానం, ప్రసాదం కౌంటర్, క్యూలైన్ల వద్ద సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడికక్కడ సూచిక బోర్డులు, వికలాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని విభాగాల అధికారులతో ఆలయ సమీపంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న దుకాణాలను వెనక్కి జరపాలని, ట్రాఫిక్ అంతరాయం, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేవా సంఘాలు, ఎన్.ఎస్.ఎస్., ఎన్.సి.సి. వాలంటీర్లను వినియోగించుకోవాలని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి రోజూ అన్నదానం, డిసెంబర్ 26న మహాన్నదానం

భక్తుల సౌకర్యార్థం ప్రతి రోజూ ఉదయం 11.00 గంటల నుంచి జగన్నాథ స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ ఉంటుందని, అలాగే డిసెంబర్ 26వ తేదీన సున్నపువీధి దిగువ నుంచి కొత్తరోడ్డు వరకు గల రోడ్డులో మహాన్నదానం ఏర్పాటు చేస్తున్నామని ఉప కమిషనర్, ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఉచిత, సర్వ దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తూ వీఐపీ పాసులను పరిమితం చేశామని, దర్శన వేళలను కూడా కుదించామని చెప్పారు. ఉదయం 6.00 నుంచి 8.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 నుంచి 4.00 గంటల వరకు వీఐపీ దర్శనాలు ఉంటాయని వివరించారు. విశిష్ట దర్శనం రూ.500, రూ.200, ప్రత్యేక దర్శనం రూ.100గా కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మార్గశిర మాసోత్సవాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు.

దర్శన వేళలు... అభిషేకాలు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా నాలుగు గురువారాలు డిసెంబర్ 05, 12, 19, 26వ తేదీల్లో వస్తున్నట్లు ఈవో వెల్లడించారు. ఈ దినాల్లో బుధవారం తెల్లవారు ఝాము నుంచే దర్శనాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సాధారణ రోజుల్లో ఉదయం 6.00 నుంచి 11.30, మధ్యాహ్నం 12.00 నుంచి సాయంత్రం 5.30 వరకు, రాత్రి 7.00 నుంచి 9.00 గంటల వరకు సర్వదర్శనం ఉంటుందని చెప్పారు.

మిగతా 2లో

గిరిజన విశ్వవిద్యాలయంలో

రసాయన శాస్త్ర పురోగతిపై మూడు రోజుల వర్క్‌షాప్

విజయనగరం టౌన్, నవంబర్ 21, మేజర్‌న్యూస్

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ అవుట్‌రీచ్ ప్రోగ్రాం ను 'రసాయన శాస్త్రాలలో అభివృద్ధి' అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. నవంబర్ 23 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో తాజా రసాయన శాస్త్ర పరిశోధనలు, విద్యా సహకారం, విద్యార్థుల పరిశోధనా సామ ర్థ్యాల అభివృద్ధి వంటి ముఖ్య అంశాలపై లెక్చర్స్ ఉంటాయి. యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభోత్సవ సమావేశంలో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ ప్రధాన సంపాదకులు ప్రొఫెసర్ ఎస్. నటరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎస్. నటరాజన్ మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో తాజా పురోగతుల ప్రాధాన్యతను వివరించారు. 'రసాయన శాస్త్ర అభివృద్ధి సమాజ అభివృద్ధికి మూలస్తంభం' అని పేర్కొన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.వి. కట్టిమని అధ్యక్షత వహించి, విద్యా రంగంలో ఉన్నతమైన లక్ష్యాలను సాధించడంలో విశ్వవిద్యాలయ పాత్రపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు డా. సురేష్ బాబు కె, ప్రొఫెసర్ ఎం. శరత్‌చంద్ర బాబు, డా. కిశోర్ పడాల నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో పరిశోధనా ఆవేశం పెంపొందించడంతోపాటు, విద్యా మేధస్సుకు కొత్త మార్గాలను సృష్టించేందుకు తోడ్పడు తుందని నిర్వాహకులు తెలిపారు. గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆటోలో 20 మంది స్కూల్ పిల్లలు

డ్రైవర్‌కు రూ.10 వేల జరిమానా

విశాఖపట్నం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

ఇష్టాను సారంగా నగరంలో ఆటోలు నడుపుతున్న డ్రైవర్లపై నగర ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. పరిమితికి మించి మరీ ప్రయాణీకులతో రాకపోకలు సాగిస్తూ ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోని వారిపై నగర పోలీసులు కన్నెర్రజేశారు. నిరంతరం ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై చలానాలు రాస్తున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా కొందరు ఆటో డ్రైవర్లు దురుసుగా ప్రవర్తిస్తున్న సంఘటనలు కోకొల్లలు. అయితే గురువారం విశాఖ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పూర్ణ మార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ విశ్వనాధం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో 20 మంది స్కూల్ పిల్లలతో వస్తున్న ఆటోను గమనించి ఆ వాహన డ్రైవర్‌కు రూ.10వేల జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని, ఆటో వాళ్లు స్కూల్ పిల్లల్ని తీసుకొచ్చినప్పుడు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు హెచ్చరించారు. నిబంధనల మేరకు ఆటో డ్రైవర్లు నడుచుకోవాలని అందుకు పోలీసులకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్లో మార్పు

పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్

పార్వతీపురం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ మారిందని పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలపై సంబంధిత అధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి మారిన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 5వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని చెప్పారు. అదే రోజున సాధారణ సమావేశం నిర్వహించే ప్రదేశాన్ని ప్రచురించడం జరుగుతుందని అన్నారు. 8వ తేదీన ఎన్నికల అధికారి నేతృత్వంలో నీటి వినియోగదారుల సంఘాలు సాధారణ సమావేశం జరుగుతుందని, అదే రోజున మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. 11వ తేదీన ఎన్నికల అధికారి నేతృత్వంలో నీటి పంపిణీ సంఘాలు (డిస్ట్రిబ్యూటరి) ఎన్నికలకు సాధారణ సమావేశం జరుగుతుందని, అదే రోజున మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులకు, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నీటి పంపిణీ సంఘాల అధ్యక్షులకు నోటీసులు

మిగతా 2లో

సంకల్పంతోనే మాదకద్రవ్యాల వ్యాప్తికి చెక్

విశాఖ రేంజ్ డి.ఐ.జి గోపీనాథ్ జట్టి

పాయకరావుపేట, నవంబర్ 21, మేజర్‌న్యూస్

సంకల్పంతోనే యువత మాదకద్రవ్యాల వ్యాప్తికి చెక్ పెట్టగలరని విశాఖపట్నం రేంజ్ డి.ఐ.జి గోపీనాథ్ జట్టి ఐ.పీ.ఎస్ అన్నారు. ఈ మేరకు శ్రీ ప్రకాష్ లో ఏర్పాటు చేసిన సంకల్పం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను యువతకు వివరించారు. గంజాయి మత్తులో యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని తెలిపారు. సందేశాత్మక లఘు చిత్రాలను ప్రదర్శించి యువతకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐ.పీ.ఎస్ మాట్లాడుతూ గంజాయి అమ్మకం, వాడకం,రవాణా పై ఫిర్యాదులు చేయవచ్చునని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలిపారు. మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడం కోసం ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. విద్యార్థుల చేత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనం తరం విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సి.హెచ్ విజయ ప్రకాష్, డి.ఐ.జి గోపీనాథ్ జట్టి,ఎస్.పి తుహిన్ సిన్హా లను శాలు వాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి జి.ఆర్.ఆర్ మోహన్, సి.ఐలు జి.అప్పన్న,రామకృష్ణ, కుమారస్వామి, ఏ.ఎస్.ఐ గోవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు స్టేషన్లలో 9 కేసుల్లో

ముగ్గురు నిందితుల అరెస్టు

188 గ్రాముల బంగారం, మోటార్ సైకిళ్ళు స్వాధీనం

అనకాపల్లి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

తొమ్మిది కేసుల్లో నిందితులను అరెస్టు చేసి 188 గ్రాముల బంగారం, ఐదు మోటార్ సైకిళ్ళు, ఒక సెల్ ఫోన్ ను జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వివరాలను వెల్లడించారు. ఎలమంచిలి రూరల్ పోలీసులు 4 కేసుల్లో

మిగతా 2లో

మత్స్య సంపద కలుషితం చేయొద్దు..!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్లయితే ప్రభుత్వం, న్యాయాలయాలు సూచించిన మార్గదర్శకాలు పాటించాలని కోరారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి లక్ష్మణరావు మాట్లాడుతూ సముద్రపు ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు సముద్రంలో వృధాగా పడి ఉన్న వ్యర్థ వలలు కారణంగా మత్స్య జీవరాసులకు కలిగే నష్టాలను గురించి వివరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ఏర్పాటు చేసిన ఆధునీకరణ మెరైన్ మ్యూజియమును తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన ద్వారా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అవగాహన సదస్సులో భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి డి. బామిరెడ్డి, శాస్త్రవేత్త జీవీఏ ప్రసాద్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ రమణమూర్తి, ఎంపెడా, సిఫ్‌నెట్, మొదలగు కేంద్ర మత్స్య పరిశోధన సంస్థల అధికారులు, వివిధ మత్స్యకార సంఘాల ప్రతినిధులు, బోట్లు యజమానుల సంఘం సభ్యులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

పెండింగ్ రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. ఈ ఆఫీసు పై అందరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, ఉప కలెక్టర్లు పద్మావతి, లక్ష్మణమూర్తి, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ, సర్వే అండ్ లాండ్ రికార్డులు శాఖ సహాయ సంచాలకులు విజయ్ కుమార్, కలెక్టరేట్ ఆయా విభాగాల పర్యవేక్షులు సరోజని, సూర్యనారాయణ, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, తహసీల్దార్లు, డిటిలు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్లో మార్పు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. 14వ తేదీన ఎన్నికల అధికారి నేతృత్వంలో మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల ఎన్నికలకు అసాధారణ సమావేశం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అన్నారు. ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు.

'కనకమ్మ' అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

భక్తులు ఈ వేళల్లో అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు. త్రికాల సమయాల్లో అభిషేకాలు జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్, ఆలయ ఈవో కె. శోభారాణి, సహాయక ఈవో టి. అన్నపూర్ణ, కార్యనిర్వహక అధికారి సి.హెచ్.వి. రమణ, సహాయక ఈవో తిరుమలేశ్వరరావు, అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సుమారు రూ.11,30,000/- విలువ కలిగిన 45 గ్రాముల బంగారు హారం, 4 ద్విచక్ర వాహనాలు, ఒక మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులు అరెస్ట్ చేసారన్నారు. అచ్యుతాపురం, పరవాడ పోలీస్ స్టేషన్ లకు సంబంధించిన 5 చోరీ కేసుల్లో సుమారు రూ.10 లక్షల విలువగల 143 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 9 కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, సుమారు రూ.21,30,000/- లక్షల విలువైన 188 గ్రాముల బంగారం, మోటార్ సైకిల్స్ తదితర చోరీ సొత్తును జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. పై కేసుల్లో నిందితుడిని అచ్యుతాపురం - గాజువాక రోడ్, నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అరెస్ట్ చేశారన్నారు. ఎ 2 ను పట్టుకునే క్రమంలో తప్పించుకుని పారిపోయాడని, గాలింపు చర్యలు తీసుకున్నామని, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న సందర్భంగా జిల్లా ఎస్పీ పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, పరవాడ ఇన్స్పెక్టర్ ఆర్.మల్లికార్జున రావు, అచ్యుతాపురం ఇన్స్పెక్టర్ ఎన్.గణేష్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ కె.అప్పలనాయుడు ఎలమంచిలి రూరల్ ఎస్సై ఎం.ఉపేంద్ర, సీసీఎస్ సిబ్బందిని, క్లూస్ టీం, ఐటీ కోర్ సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎల్.మోహన్ రావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ కె.అప్పలనాయుడు, ఎలమంచిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.ధనుంజయరావు, అచ్యుతాపురం ఇన్స్పెక్టర్ ఎన్.గణేష్, సీసీఎస్ ఎస్సైలు పి.రమేష్, ఎన్.సత్యనారాయణ, ఎలమంచిలి రూరల్ ఎస్సై ఎం.ఉపేంద్ర, అచ్యుతాపురం ఎస్సై కె.సుధాకర్ రావు, సీసీఎస్ ఏస్సై కుమార్, హెచ్.సీ అప్పలరాజు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ హెచ్ఎంఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రజలందరూ ఇళ్లకు తాళాలు వేసుకొని ఊరులు వెళ్ళినప్పుడు సమీపంలోని పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని, తద్వారా లాకెడ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్ హెచ్ ఎం ఎస్) సేవలు కలుగజేస్తామని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి దొంగతనాలను అరికట్టుటకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన మీడియాతో వేదికగా ప్రజలను కోరారు.

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానంలో అత్యంత వైభవంగా పునర్వసు హెూమం

విశాఖపట్నం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

శ్రీ స్వామివారి సింహగిరి పై గల గంగధార సమీపంలో గల ఉప ఆలయం రామాలయంలో బుదవారం శ్రీరాముని జన్మ నక్షత్రం అయిన పునర్వసు నక్షత్రం పురస్కరించుకొని శ్రీరామ షడక్షరి, సంక్షిప్త రామాయణం పారాయణం అత్యంత వైభవంగా జరిపించారు. ప్రతి నెల శ్రీరాముని జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రం పురస్కరించుకొని శ్రీ స్వామివారి ఉపాయాలయమైన రామాలయం నందు పునర్వసు హెూమం అత్యంత వైభముగా జరిపించ బడును హెూమం సందర్భంగా శ్రీరాముని సంక్షిప్త రామాయణం పారాయణం శ్రీరాముని షడక్షరి పారాయణం స్వామివారి ఆలయ వేద పండితులు, అర్చక స్వాములు అత్యంత వైభవంగా నిర్వహించారు కావున భక్తులందరూ ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తిని ఒకసారి ఆయన గుణగణాలను బాలరాముని స్మరించుకుంటూ శ్రీ సంక్షిప్త రామాయణం, శ్రీరాముని షడక్షరి పారాయణం కార్యక్రమంలో ఉద్యోగులు భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకున్న ప్రీతి పాల్

విశాఖపట్నం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

విశాఖ సౌత్ 29వ వార్డు పరిధిలో భుజంగరావుపేట వాస్త వ్యులు ప్రీతి పాల్ (సింగపూర్) తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్య త్వాన్ని తీసుకునే నిమిత్తం లక్ష రూపాయల చెక్కుని ఏపీ కో ఆపరే టివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడ రేషన్ కార్పొరేషన్ చైర్మన్, విశాఖ జిల్లా టిడిపి ప్రెసిడెంట్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్, దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జి సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో విశాఖ ఎంపీ భరత్‌కి అందజేయడం జరిగింది. వార్డు ప్రెసిడెంట్ ఉరికిటి గణేష్ పాల్గొన్నారు.

ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచన

విశాఖపట్నం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గత కొంతకాలంగా సుమారు రూ.7 కోట్ల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. జీవీఎంసీ అధికారులతో కలిసి స్టేడియంను సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను గమనించారు. మైదానమంతా కలియ తిరిగి ప్రస్తుతం ఉన్న వసతులను పరిశీలించారు. క్రీడాకారుల సౌకర్యార్థం వాలీబాల్ కోర్టు, టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేసేందుకు ఉన్న ప్రతిపాదనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని రకాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి.. స్టేడియంను ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఆధునికీకరించిన గ్యాలరీలను, మరుగుదొడ్లను, ఏసీ క్యాబిన్లను, వాల్ పెయింట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల తాజా పరిస్థితిని జీవీఎంసీ సీఈ శివప్రసాద్ రాజు కలెక్టర్ కు వివరించారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనుల గురించి తెలిపారు. నూతన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కార్యాచరణ రూపొందిస్తామని ఈ సందర్భంగా చెప్పారు. స్థానిక జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ, శాప్ అధికారులు తదితరులు వారి వెంట ఉన్నారు.

బహువార్షిక పశుగ్రాసాలకు ప్రభుత్వ ప్రోత్సాహం

కోటబొమ్మాళి, నవంబరు 20, మేజర్‌న్యూస్

ప్రభుత్వం కన్వర్జన్సీ పద్ధతిలో పశు సంవర్ధక శాఖ, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా బహువార్షిక పశుగ్రాసాల సాగుని ప్రోత్సహించటం జరుగుతుందని దీని కోసం ఒక సంవత్సరముపాటు సాగు ఖర్చులను ప్రభుత్వం అందజేస్తుందని దీనిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. వీటిని సాగు చేయాలనుకున్నవారు బహువార్షిక పసుగ్రాసాల సాగు కోసం విత్తనాలు గాని, పిలకలు గాని తెలిసిన పాడి రైతుల వద్దగాని,పశువైద్యాధికారి సూచించిన అమ్మకందారు వద్దన అయినా కొనవచ్చునన్నారు. ఈ సాగుకు ఒక సంవత్సరమునకు 10 సెంట్ల విస్తీర్ణంకు రూ. 6599లు, 20 సెంట్ల కు రూ.13197లు, 30 సెంట్లకు రూ. 19795లు, 40 సెంట్ల విస్తీర్ణంకు రూ. 26394లు, 50 సెంట్ల విస్తీర్ణంకు రూ. 32992లు ప్రభుత్వం అందజేయటం జరుగుతుందని కావున అర్హతగల పాడిరైతులు త్వరగా స్పందించి పథకమును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

40 మద్యం సీసాలు స్వాధీనం

బాడంగి, నవంబర్ 20, మేజర్‌న్యూస్

మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన ఎం నవీన్ అక్రమంగా తీసుకు వెళ్తున్న 40 మద్యం సీసాలను సమాచారం మేరకు బుధవారం ఎస్ ఐ జె తారకేశ్వరరావు పట్టుకొని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై విలేకరులకు తెలిపారు.

భారీగా బెల్లం పులుపు ధ్వంసం

రావికమతం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం పులుపును కొత్తకోట ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు. కుమ్మొందాని పేట శివారు ప్రాంతాల్లో నాటు సారా ఎక్కువగా తయారవుతుందన్న స్పష్టమైన సమాచారం మేరకు కొత్తకోట ఎస్సై ఎం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. దీనిలో నాటు సారా తయారీ కి ఉపయోగించే బెల్లం పులుపును కనుగొన్నారు. దీనికి సంఘటన స్థలం లో ఏ ఒక్కరు లేకపోవడంతో బెల్లం పులుపు ధ్వంసం చేశామని ఎస్సై తెలిపారు.

కేజీబీవీలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

దేవరాపల్లి, నవంబర్ 21 మేజర్‌న్యూస్

మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో నూతన కంప్యూటర్ బిల్డింగ్ నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ వై.భారతి మాట్లాడుతూ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చొరవతో సమగ్ర శిక్ష నిధుల నుంచి రూ.18.50 లక్షలతో నిర్మాణ పనులు జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి సిహెచ్. భువన మాధురి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వవిప్ జగదీశ్వరిని సన్మానించిన టిడిపి నాయకులు

- సన్మానించిన టిడిపి కన్వీనర్ మధు, రాంబాబు, సుమన్, విజయవాంకుశంలు

గరుగుబిల్లి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

కురుపాం నియోజకవర్గ శాసనసభ్యులు తోయక జగదీశ్వరికి ప్రభుత్వ విప్ పదవి వచ్చిన నేపథ్యంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బుదవారం శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు ఘనంగా సన్మానించారు. ఈమేరకు అమరావతిలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి దంపతులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు అంబటి తవిటినాయుడు (రాం బాబు), కోట భరత్ కుమార్ (సుమ న్), ముదిలిబాబు విజయవాంకుశం, తదితరులు పుష్ప గుచ్చాలను అందజేసిన అనంతరం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

గుండెపోటుతో మరణించిన వ్యక్తి కుటుంబానికి బోసు బాబు 50,000 ఆర్థిక సహాయం

అనందపురం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

అనందపురం మండలం ముచ్చర్ల పంచాయతీ గొంపవానిపాలెం గ్రామంలో నివసిస్తున్న గొంప రమణ ఇటీవల గుండు పోటుతో మరణించడంతో ఆ కుటుంబ సహాయనిమిత్తం మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ బుధవారం ఆ కుటుంబానికి 50వేల రూపాయలు హార్దిక సహాయం చేశారు ఈ కార్యక్రమంలో అప్పలనారాయణ శివ అప్పల రమణ పాల్గొన్నారు.

షిరిడి గిరిపై బాబా వారి 23వ శంకుస్థాపన వార్షికోత్సవ ఉత్సవాలు

పాతపట్నం, నవంబర్ 20, మేజర్‌న్యూస్

పాతపట్నం షిరిడి గిరి పై వెలసిన శ్రీ షిరిడి సాయి ధ్యాన మందిరం 23 వ శంకుస్థాపన వార్షికోత్సవ ఉత్సవాల సందర్భంగా శ్రీ సాయినాధుని ఆశీస్సులతో భక్తుల సహకారంతో తేదీ 21 .11.2024.ఉదయం 6 గంటలకు అఖండ సాయి సంకీర్తన దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్ణహుతి,మధ్యాహ్నం 11 గంటలకు పడాల హరిదాసు మాస్టర్ చే సత్సంగం సాయంత్రం మూడు గంటలకు బాబా వారి చిత్రపట ఊరేగింపు తేదీ 22. 11. 2024 ఉదయం 9 గంటలకు ఆశ్రమం హరిద్వార్ వారి గాయత్రి పరివార్ చే శ్రీ గాయత్రి మాత యజ్ఞం తేదీ .23. 11 .24. ఉదయం 10 గంటలకు పూజ్యశ్రీ నిర్విషయానంద స్వామి వారి అనుగ్రహ భాషణ మధ్యాహ్నం 12 గంటల నుండి మహాన్న ప్రసాద్ పంపిణీ సాయంత్రం ఏడు గంటలకు శ్రీ శిరిడి సాయి సాంస్కృతి సంస్థ వారిచే భజన కార్యక్రమం. ఈ కార్యక్రమాల్లో అందరూ పాల్గొని శ్రీ సాయినాధుని తీర్థప్రసాదాలు స్వీకరించి వారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ వారు తెలియచేసారు.

బాల కార్మికుల దుకాణాల్లో పెట్టుకోవద్దు

పాతపట్నం, నవంబర్ 20, మేజర్‌న్యూస్

బాలకార్మిక వ్యవస్థను నిర్మూళించడం అందరి బాధ్యతని కార్మిక శాఖాధికారి శైలేష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని, బాల కార్మిక వ్యవస్థను నియంత్రించేందుకు పలు దుకాణాల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో చిన్నారులకు విద్య చాలా అవసరమని చదువు కోలేని పిల్లలను పనికి కాకుండా పాఠశాలలో చేర్పించాలని సూచించారు. 18 ఏళ్ల లోపు చిన్న పిల్లలను ఎవరైనా పనిలో చేర్చుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే బాలలను కార్మికులుగా కాకుండా విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ ధర్మాన సీతారాములు, సర్వ శిక్షా అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ పూడి జనార్ధన రావు, పాతపట్నం ఎస్సై బైరిశెట్టి లావణ్య, చైల్డ్ హెల్ప్ లైన్సూపర్వైజర్ జి. మౌనిక, స్వచ్ఛంద సేవా సంస్థలు, పలువురు అధికారులు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతా రోడ్లకు మహర్దశ

- కోటి 60 లక్షలతో రామవరం రోడ్డు పనులు

అనందపురం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు అనందపురం మండల పార్టీ నాయకులు తాట్రాజు అప్పారావు సర్పంచ్ ,బి ఆర్ బి నాయుడు పేర్కొన్నారు. కూటమి నాయకులు మండల పరిషత్ కార్యాలయం సమీపంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ గండిగుండం నుండి వయా రామవరం, భీమన్న దొరపాలెం వరకు సుమారు 7 కిలోమీటర్లు బిటి రోడ్డుకు కోటి 60 లక్షల రూపాయలు ఎనర్జీఎస్ నిధులు మంజూరు అయినట్లు తెలిపారు కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోని సుమారు 7 కోట్ల రూపాయలతో పలు గ్రామాలలో రోడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు అందులో భాగంగా బీటీ రోడ్లు దబ్బంద, అరిగి మేరక , దొంత ల వారి కల్లాలు, ఆకుల వారి కల్లాలు, జిఎస్ అగ్రహారం, రామవరం లోను,సిసి రోడ్లు పాలవలస ,ఎల్వి పాలెం, తర్లువాడ ,గంభీరం, పేకేరు ,వేములవలస తదితర గ్రామాలలో సుమారు ఏడు కోట్లతో రోడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు మరల సుమారు మూడు కోట్ల రూపాయలతో పలు గ్రామాలలో డ్రైనేజ్ పనులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు అభివృద్ధి పనులకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుకు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు తాట్రాజు ఆదినారాయణ, సర్పంచ్ బి ఆర్ బి నాయుడు,పాండ్రంకి అప్పలరాజు, గన్ రెడ్డి రమేశ్, బంటు చిన్న ఆబోతు అప్పల రాము, కట్టమూరి సోమ నాయుడు, పప్పల శ్రీకాంత్ ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు

క్రైస్తవ చెర్చికి తాళం కన్నంపేట శ్రీరామ్ నగర్ కాలనీలో స్వల్ప ఉద్రిక్తత

రావికమతం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

మండలంలో కన్నంపేట శ్రీ రామ్ నగర్ కాలనీలో గత కొంతకాలంగా కొనసాగుతున్న చెర్చికి కాలనీ కి చెందిన మంతెన సూరిబాబు కుటుంబం బుధవారం తాళం వేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ కాలనీకి చెందిన సూరిబాబు కుటుంబ సభ్యులు పదేళ్లు క్రితం లిఖిత పూర్వకంగా ఇచ్చిన ఖాళీ స్థలంలో కొత్తకోట గ్రామానికి చెందిన పాస్టర్ కిడారి మల్లేష్ చెర్చి నిర్మించుకున్నారు క్రమం తప్పకుండా ఇక్కడ ప్రార్థనలు కొనసాగుతున్నాయి. ఈ చెర్చి లో సూరిబాబు కుటుంబం కూడా ప్రార్థనలు జరిపేవారని మల్లేష్ తెలిపారు. ఇటీవల కాలంలో సూరిబాబు కుటుంబం మతం మార్చుకొని చెర్చి ఖాళీ చేసి స్థలం అప్పగించాలని డిమాండ్ చేశారు. దీనికి పాస్టర్ అంగీకరించకపోవడంతో తాళం వేశారు ఈ వివాదం పై గ్రామములో ఇరువర్గాలుతో పంచాయతీ కూడా నిర్వహించారు అయినప్పటికీ వివాదం సద్దుమణగలేదు. పాస్టర్ మల్లేష్ కు దళిత సంఘాలు సంఘీభావం తెలిపాయి. దీంతో ఇది చినుకు చిలికి గాలి వానగా మారనున్నదో నని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

గుమ్మడి వాని పాలెం ఎంపీపీ స్కూల్ అంగన్వాడి భవనాలకు శంకుస్థాపన

అనంతపురం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

ఆనందపురం మండలం శొంత్యాం పంచాయతీ గుమ్మిడివానిపాలెం గ్రామం లో ఎంపీపీ స్కూల్, అంగన్వాడీ భవనాలకు 6 లక్షల 96 వేల ఎంజిఎన్ఆర్జిఎస్ నిధుల ను బీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ద్వారా నిధులను మంజూరు చేశారు. స్థానిక సర్పంచ్, కూటమి నాయకుల ఆధ్వర్యంలో బిల్డింగులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి వెంకటర్రావు, రాంబాబు, కూటమి నాయకులు లొకిరెడ్డి అచ్చిబాబు, కోరుకొండ మూర్తి,కోరాడ శ్రీను,బొద్దపు గోవింద, గుర్ల ముసలినాయుడు, గోంతిన ముసలినాయుడు, గుర్ల విజయ్, అప్పలరాజు, ఎంపీటీసీ పల్లా రమణ, మాజీ ఎంపీటీసీ రమణ, కార్యక్రమంలొ పాల్గొన్నారు

23 నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ క్రికెట్ పోటీలు

- విశాఖ, విజయనగరంలో ఏర్పాట్లు పూర్తి- ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు

విశాఖపట్నం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

దేశవాలీ టీ20 క్రికెట్ టోర్నీ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ పోటీలు విశాఖపట్నం పీఎంపాలెం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, విజయనగరంలోని పీవీజీ రాజు కాంప్లెక్స్, విజ్జి స్టేడియంలలో ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. ఈ మ్యాచ్‌లు డిసెంబర్ 5వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. మ్యాచ్ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో అస్సాం, రైల్వేస్, చండీగఢ్, పాండిచ్చేరి, విదర్భ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ జట్లు పోటీపడనున్నాయి. ఆయా జట్లు బుధవారం విశాఖపట్నం చేరుకున్నాయి. ఇండియా, ఐపీఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లు ఇందులో పాల్గొననున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

భీమునిపట్నం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయంలో వారం రోజులపాటు గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, క్విజ్, బుక్ సెర్చింగ్ మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. మురళీకృష్ణ గారు మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, పుస్తకాల వలన మానసిక వికాసం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న గ్రంథాలయ అధ్యాపకులను అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రివర్యులు గౌరవనీయులైన శ్రీ అవంతి శ్రీనివాసరావు గారు అభినందించారు ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ తిప్పాను జగన్నాథం గారు, బేసిక్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి జె.ఆర్.జి.పట్నాయక్ గారు, అధ్యాపకులు, ఎస్.ఏ. శ్రీనివాసరావు గారు, గోక చంద్రకళ గారు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ సమస్యలపై అవగాహన లేని ఎమ్మెల్సీ నర్తు

– శాసనమండలిలో ప్రసంగాన్ని వెనక్కి తీసుకోవాలి – వెంటనే క్షమాపణ చెప్పాలి, లేదంటే ఇల్లు ముట్టడిస్తాం– ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి

సారవకోట, నవంబర్ 21, మేజర్‌న్యూస్

శాసనమండలిలో ఎమ్మెల్సీ నర్తు రామారావు అవగాహన లేకుండా మాట్లాడడం శ్రీకాకుళం జిల్లా ఆదివాసి మనోభావాలుదెబ్బతీశాయి. నర్తు.రామారావు ఆదివాసులకి బహిరంగ క్షమాపణ చెప్పాలి. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న నకిలీ బెంతు ఒరియాలని స్వయంగా గిరిజన సంస్కృతి సాంప్రదాయాల పరిశోధన సంస్థ అధ్యాయనం చేసి అప్పటి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఆనివేదిక ఆధారంగా శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియాలుగా చెప్పుకుంటున్న వారు వడ్డీ బీసీఏ కులానికి చెందిన వారిని ప్రభుత్వమే డిక్లేర్ చేసింది. ఈ విషయం తెలుసుకోకుండా అవగాహన రహిత్యంగా శాసన మండలిలో మాట్లాడడం సిగ్గుచేటు శ్రీకాకుళం జిల్లాలో ఉన్నటువంటి నకిలీ బెంతు ఒరియాలపై మీకు అవగాహన కలగాలంటే విశాఖపట్నంలో ఉన్నటువంటి గిరిజన సాంస్కృతి సాంప్రదాయ పరిశోధన సంస్థ కార్యాలయానికి వెళ్లి అవగాహన కల్పించుకోవాల్సిందిగా వాబ.యోగి అన్నారు. నర్తు.రామారావు ప్రజాక్షేత్రంలో ఓడిపోయి దొడ్డిదారిలో ఎమ్మెల్సీగా వెళ్లారని గుర్తు తెచ్చుకోవాలని వాబ.యోగి గుర్తు చేసారు. ఎమ్మెల్సీ నర్తు ఇదే వైఖరి కొనసాగించినట్లయితే రాబోయే పంచాయతీ ఎన్నికలు రాబోయే ఎంపీటీసీ ఎన్నికలు రాబోయే జడ్పిటిసి ఎన్నికలలో పూర్తిగా వైఎస్సార్సీపీ పార్టీని ఓడిస్తాం. నర్తు.రామారావు మాట్లాడిన మాటలపై వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కలగజేసుకుని ఎమ్మెల్సీ నర్తు రామారావు కి హితబోదేశం చెయ్యాలని జిల్లాలో ఆదివాసులు పడుతున్న సమస్యలపై ఆయనకు పూర్తిగా అవగాహన కల్పించాలని వాబ.యోగి మీడియాతో అన్నారు. మరోసారి ఆదివాసి మనోభావాలు దెబ్బతీసేటట్టుగా ఎక్కడైనా మాట్లాడినట్లయితే ఎమ్మెల్సీ ఇల్లు ముట్టడిస్తామని వాబ.యోగి హెచ్చరించారు. నకిలీ బెంతు ఒరియాలకి ఎమ్మెల్సీ కాదని ఆయన ప్రజల తరపున ఎమ్మెల్సీ అని గుర్తు చేశారు. ఏ ఒక్క రోజు కూడా శ్రీకాకుళం జిల్లాలో ఆదివాసులు పడుతున్న ఇబ్బందుల పైన శాసన మండల్లో మాట్లాడడం చేతకాదు గాని నకిలీల పైన అంత ప్రేమ ఎందుకో అని వాబ.యోగి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ సభ్యులు జన్నిదాలయ్య, బొమ్మాలి కృష్ణ, బాలరాజు, నాగయ్య, రంగారావు, లక్ష్మణరావు,తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై 26న శంఖారావం

వాల్ పోస్టర్లును విడుదల చేస్తున్న అఖిల పక్ష నాయకులు

బొబ్బిలి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న శంఖారావం నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లాఅధ్యక్షులు పి.శంకరరావు తెలిపారు. ఏఐటియుసి జిల్లా నాయకులు ఎం. శ్రీనివాసరావు, పిసిసి సభ్యులు ఎం. శ్రీనివాసరావు, పట్టణ కళాసీ సంఘం నాయకులు వై. అప్పారావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం శంఖారావం ప్రచార పత్రాలను విడుదల గురువారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులపై భారాలు వేస్తూ పాలన చేస్తుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, ఎరువుల ధరలు పెంచి ప్రజలు, రైతులు నడ్డి విరుస్తున్న మోడీ గత పదేళ్లలో కార్పోరేట్ సంస్థలకు రూ. 19.28లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని విమర్శించారు. కార్మికుల హక్కులపై దాడి చేసేందుకు లేబర్ కోడ్ చట్టాలను తీసుకు వచ్చారని, వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అప్పగించేందుకు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చార న్నారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తన్నలు పోరాటం చేస్తే రద్దు చేసి రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మోడీ అమలు చేయడం లేదన్నారు. కార్మిక చట్టాలను అమలు చేసి లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న బొబ్బిలి ఎన్టీఆర్ విగ్రహం జంక్షన్ నుంచి బజారు, మేధరబంద, చర్చి సెంటర్, శ్రీవేణుగోపాల స్వామి ఆలయం జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలుపుతామని చెప్పారు. నిరసన ర్యాలీను జయప్రదం చేయాలని కోరారు.

సాయి నామ కీర్తనలతో పునీతమైన భక్తులు

పూసపాటిరేగ, నవంబర్ 21, మేజర్‌న్యూస్

సాయి నామ కీర్తనలతో కందివలస సాయి ఆశ్రమం మార్మోగింది. కార్తీక మాసంలో వచ్చే చివరి గురువారం కావడంతో సాయినాధుని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సాయి సేవకులతో పాటు ఆధ్యాత్మిక భక్తులు అధిక సంఖ్యలో రావడంతో సాయి సేవాశ్రమం కిటకిటలాడింది. సాయి గురు బొడ్డు విజయరామయ్య కాకడ హారతిని అందించి షిరిడి సాయి కీర్తనలు ఆలపించడంతో ఆలయ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మికంతో పరవశించిపోయింది. షిరిడి సాయి జీవిత సత్యాలతో పాటు జీవిత రహస్యాలను సాయి గురు విజయ రామయ్య వివరించి భక్తులను పరవశింప చేశారు. ప్రతి ఒక్కరూ ఎదుటివారికి సహాయం చేయడం, జ్ఞాన సంపదను తెలుసుకోవడం షిరిడిసాయే అందరివాడని తెలుసుకోవలసిన జీవిత రహస్యమని విజయరామయ్య వివరించారు. అనంతరం షిరిడి సాయి దర్శనాలతోపాటు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గిరిజన ప్రాంతాల్లో ధాత్రి అభి జూన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్

– పాల్గొన్న ఎంపిడిఓ రవికుమార్

బొబ్బిలిరూరల్, నవంబర్ 21, మేజర్‌న్యూస్

గిరిజన ప్రాంతాల్లో నివశిస్తున్న షెడ్యూల్ కులానికి చెందిన ప్రజలకు జీవనోపాధి పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ పి. రవికుమార్ తెలిపారు. ఈ మేరకు బొబ్బిలి మండలంలో సిహెచ్ బొడ్డ వలస పంచాయతీ పరిధిలోని శివారు గ్రామం అయిన నిమ్మల పాడు లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఓ రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా షెడ్యూల్ తెగల సంక్షేమ అభివృద్ధి అధికారి విజయనగరం వారి ఆదేశాల మేరకు లిధాత్రి అభి జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్‌లి పథకం మేరకు బొబ్బిలి మండలంలో సిహెచ్ బొడ్డవలస గ్రామ పంచాయతీలో శివారు గ్రామం అయిన నిమ్మలపాడు గ్రామంలో షెడ్యూల్ తెగలు వారి జీవనోపాధి విద్యా వైద్య ఇతర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు జరపడమైనది. ఈ కార్యక్రమానికి ఈఓఆర్టి భాస్కరరావు గ్రామ సర్పంచి వేలింగిణి ఎంపీటీసీ మండల అధికారులు అందరూ కూడా హాజరు అవడం అయినది. సదరు గ్రామంలో ప్రధాన అవసరాలు మరియు సమస్యలన్నీ కూడా గుర్తించి పై అధికారులకు తెలియపరచడం జరుగును. ఎంపిడిఓ తెలిపారు.

చేపల పెంపకం ద్వారా గిరిజనులకు ఆదాయం: ఐటిడిఎ ఏపీవో జి.చిన్నబాబు

సీతంపేట, నవంబర్ 21, మేజర్‌న్యూస్

వరల్డ్ ఫిషరీస్ డే సందర్భంగా, సీతంపేట గిరిజన ప్రాంతాల్లో మత్స్య సంపద ద్వారా ఆదివాసీకు టుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చవచ్చని ఐటిడిఎ ఏపీవో జి.చిన్న బాబు,నాబార్డ్ డిడిఎం దినేష్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం వాసన్ సంస్థ ఆధ్వర్యంలో నౌగుడ గ్రామంలో ఆదివాసీ మత్స్యకార రైతులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాసన్ సంస్థ చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ మోడల్‌లో భాగమైన నాటుకోళ్ల పెంపకం పెడ్లను ప్రారంభించారు. అనంతరం వారు రైతులతో సమావేశమై, వారి కుటుంబ జీవనాధార ప్రధాన వనరులపై చర్చించారు. మోలా చేపలు పెంపకంతో రైతులకు అధిక పోషక విలువలతో పాటు విటమిన్లు, కాల్షియం, ఐరన్, జింక్, పొటాషియం మరియు ముఖ్యమైన కొవ్వు ఆమ్లాలు అందుతుందని తెలిపారు. మోలా ఫిష్ పెంపకం ప్రాజెక్టును ప్రాథమిక దశగా ప్రారంభించగా, ఇది పౌష్టికాహార భద్రతకు మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధులు ఎం. సన్యాసిరావు, డీకే పాత్రో, ప్రియాంక, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

పూసపాటిరేగ, నవంబర్ 21, మేజర్‌న్యూస్

మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు మరమ్మత్తు పనుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దేవుడు ఓ ప్రకటనలో తెలిపారు. గోవిందపురం సబ్ స్టేషన్ పరిధిలో గోవిందపురం తో పాటు భరణికాం, లంకలపల్లి పాలెం , వెంపడం, తాళ్ల పేట, గులివిందలపేట, గుంపాం, తొత్తడం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పూసపాటిరేగతోపాటు పేరాపురం, పూసపాటి పాలెం, కుములి కోళ్ల ఫారాలకు ఉదయం 10 నుంచి రెండు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తుండగా, పతివాడ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పతివాడ, చిన్న పతివాడ, రాయుడుపేట, తమ్మయ్యపాలెం, బర్రిపేట, కొల్లాయి వలస, కృష్ణాపురం, చౌడువాడ, కోనాయిపాలెం, పొసపాల పాలెం, చింతపల్లి గ్రామాలకు కూడా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని విద్యుత్ శాఖ ఏఈ దేవుడు తెలిపారు.

పనివేళల పెంపు ఉత్తర్వులు నిలుపుదల చేయాలి

- డిటిఎఫ్ డిమాండ్

ఆమదాలవలస, నవంబర్ 22, మేజర్‌న్యూస్

రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ ఉన్నత పాఠశాలల పని వేళలను పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే నిలుపుదల చేయాలని డి. టీ. ఎఫ్. శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల పని వేళలు పెంచడం విద్యార్థులు, ఉపాధ్యాయులు పై మానసిక ఒత్తిడి పెంచడం అవుతుంది అన్నారు. ఇప్పుడు ఉన్న పని వేళ లు కొనసాగిస్తూనే, పదవ తరగతి విద్యార్థులకు మార్చి పబ్లిక్ పరీక్షలు ప్రిపేర్ కోసం ప్రతీ రోజు సాయంత్రం 4-5 గంటల వరకు రోజుకు ఒక సబ్జెక్టు స్టడీ హౌర్‌ను పెట్టడం మంచిదని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం పనివేళ మార్పు ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించు కోవాలని డిటిహెచ్ డిమాండ్ చేశారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరముగా ఉండాలి

మెలియాపుట్టి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

జీవితాన్ని నాశనం చేసే మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పాతపట్నం సీఐ వి .రామారావు అన్నారు. మెలియాపుట్టి మండలం కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల వాడకం పై కలిగే నష్టాలను తెలియజేస్తూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాటాడుతూ విద్యార్థులు చదువుల పట్ల దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,విద్యార్థులు ,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రగ్బీ జిల్లా స్థాయి జట్టు ఎంపిక

టెక్కలి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

శ్రీకాకుళం జిల్లా రగ్బీ అసోసియేషన్ సెలక్షన్స్ టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్ 12 బాలురు మరియు బాలికలు రగ్బీ ఎంపికలు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు డొంకన రామకృష్ణ మరియు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోవిందమ్మ ప్రారంభించారు. మొత్తం టీం 24 మందికి (బాలురు 12 మంది ంబాలికలు 12) మంది ఎంపిక చేయడం జరిగింది. ఈ ఎంపికైన క్రీడాకారులు ఉద్దేశించి డొంకన రామకృష్ణ రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి మన శ్రీకాకుళం జిల్లా కి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. రాష్ట్రస్థాయిలో 1,2 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలి ఈ పోటీలు జరుగుతున్నాయి. ఈ ఎంపికైన క్రీడాకారుల నెల్లూరు వెళ్లడానికి ప్రయాణ ఖర్చులు శ్రీకాకుళం జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షులు డొంకన రామకృష్ణ ఇవ్వడం జరిగింది, ఎంపికలో శ్రీకాకుళం జిల్లా రగ్బీ ప్రధాన కార్యదర్శి పొన్నాడ పార్వతీశం మరియు ఆర్గనైజేషన్ సెక్రటరీ బాడాన నారాయణరావు,కే.కే.రామిరెడ్డి,కాపుల రఘునాథరావు,డిగ్రీ కాలేజ్ పీడీసత్యనారాయణ, పి.జగదీష్, అప్పనమ్మ,ప్రమీల,భారతి, దుర్గ,సీతయ్య, మొదలగు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

శ్రీ విశ్వనాథ గురుస్వామి వర్ధంతిని పురస్కరించుకొని గురువారం బొబ్బిలి పట్టణంలో గల అయ్యప్ప స్వామి ఆలయం వద్ద గురువారం శ్రీ విశ్వనాథ గురుస్వామి వర్ధంతిని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో బొబ్బిలి మాజీ శాసనసభ్యులు శంభంగి వెంకట చిన అప్పలనాయుడు చేతులు మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా శంభంగి విశ్వనాథ గురుస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు అయ్యప్ప స్వాములు, పేద ప్రజల పాల్గొన్నారు.

అక్రమ పశు రవాణా అడ్డుకున్న పోలీసులు

నరసన్నపేట, నవంబర్ 21, మేజర్‌న్యూస్

నరసన్నపేట మండలం టోర్లేట్ సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీలలో భాగంగా ఎటువంటి అనుమతులు లేని పశు రవాణా చేస్తున్న వాహనాన్ని నరసన్నపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో తిలారు నుండి జగ్గంపేట కు అక్రమ రవాణా చేస్తున్న 4 అవులను, తరలిస్తున్న ఏపీ 39టి టి 2736 బోలేరు వాహనమును , డ్రైవర్ పోచన నాగేంద్ర, తమరాడ గ్రామం, ద్వారంపూడి మండలం, కాకినాడ జిల్లాకు చెందిన అతన్ని అదుపులోనికి తీసుకొని నరసన్నపేట ఎస్సై సిహెచ్.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు. అక్రమ పశు రవాణాపై సమాచారం అందిస్తే తక్షణ చర్యలు చేపడతామని, ఈ సందర్భంగా ఎస్సై తెలియజేశారు.

పాఠశాల నిర్వహణ చాలా బాగుంది

- ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు

సీతంపేట, నవంబర్ 21, మేజర్‌న్యూస్

సీతంపేట మండలం దోనుబాబు ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, తర గతి గదులను పరిశీలించారు. మెనూ చక్కగా అమలు పరచడం, వండిన ఆహార పదార్థాలు రుచికరంగా ఉండడం, పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచడం వంటి వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ పాఠశాల నిర్వహణ చాలా బాగుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం సుకుమార్, నారాయణరావు, చిరంజీవి,ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మత్స్య దినోత్సవ వేడుకలు

– మత్స్యకారులకు కూలింగ్ బాక్స్ లు అమర్చిన మోటారు సైకిళ్ళు, ఆటోలు పంపిణీ

– ఎస్సి,ఎస్టి మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.. ఐటిడిఎపిఓ శ్రీవాత్సవ

పార్వతీపురం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

ఎస్సీ ఎస్టీ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంతా సద్వినియోగం చేసుకొని ఆర్థిక పరిపుష్టి పొందాలని ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ మత్స్య దినోత్సవం కలెక్టర్ సెల్లారులో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా . పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం నవంబర్ 21న అంతర్జాతీయ మత్స్య దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధికి మత్స్యకారులు కృషి చేయాలని సూచించారు. దేశంలోనే అత్యంత పొడవైన సముద్ర తీర ప్రాంతం మన రాష్ట్రంలోనే ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలా నదులు ఉన్నాయని అన్నారు. స్థానికంగా ఉన్న వనరులకు ఉపయోగించుకుని జిల్లాను మందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. మత్స్యకారులకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా మత్స్యశాఖ అధికారికి సూచించారు. మత్స్యకారులకు ఐటీడీఏ తరపున సహాయ సహకారం ఉంటుందని పి.ఓ అన్నారు. గత నెలలో సీతంపేటలో కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో మరిన్ని అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో చేపల వేట చేస్తున్నారని, కొత్తగా అందుబాటులోకి వచ్చిన సాంకేతికను ఉపయోగించుకుని చేపల వేటను చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. టెక్నీకల్ శిక్షణకు ప్రతిపాదనలు సమర్పించాలని మత్స్య శాఖ అధికారికి ఆదేశించారు. తోటపల్లి రిజర్వాయర్ లైసెన్స్ మంజూరుకు దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. తోటపల్లి రిజర్వాయర్ చుట్టు నాలుగు మండలాలు ఉన్నాయని, లైసెన్స్ మంజూరుకు సమగ్ర నివేదిక ఇవ్వాలని మత్స్య శాఖ అధికారికి పి.ఓ ఆదేశించారు. సీతంపేట ఐటిడిఎ పి.ఓ సి యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతంపేట ఐటిడిఎ సంస్థ మత్స్యకార అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న చెరువులు, జల వనరులలో కొత్త చేపల పెంపకానికి నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు. కొత్త పద్ధతుల ద్వారా నాణ్యత, పరిమాణం వచ్చేలా ఆరోగ్యకరమైన చేపలు వచ్చేలా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. చేపల విక్రయం కోసం మత్స్యకారులకు కూలింగ్ బాక్స్ లు కలిగిన స్కూటర్లు, ఫ్రిజ్ లు ఉన్న ఆటోలను సబ్సిడీ ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అక్టివ్గా ఉన్న మత్స్య సంఘాలకు ఇచ్చే స్కూటర్లు, ఆటోలలో యాభై శాతం మహిళా మత్స్యకారులకు ఇవ్వాలని తీర్మానించడం జరిగిందని పి.ఓ పేర్కొన్నారు. మత్స్య సంపద అభివృద్ధికి మహిళా మత్స్యకారులు కృషి ఉందన్నారు. చేపల చెరువులు మహిళలకు ఇస్తే, మహిళలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. ఒకే రకమైన చేపలను పెంచకుండా, వాతావరణానికి అనుగుణంగా కొత్త రకం చేపలను పెంచాలని సూచించారు. రొయ్యల పెంపకంతో అధిక ఆదాయం లభిస్తుందని అన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య మాట్లాడుతూ ఐటిడిఎ ద్వారా జిల్లా మత్స్య శాఖకు నిధులు ఉన్నాయని తెలిపారు. మత్స్యకార అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో ప్రభుత్వం చేర్చిందని అన్నారు. మత్స్యకారులకు వలలు, వేటకు అవసరమైన పరికరాలను పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. మత్స్యకార సంఘాల సామాజిక బాధ్యతే జిల్లా మత్స్య సంపదను అభివృద్ధి పరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మత్స్యకార సంఘాలు ఐకమత్యంతో జిల్లా మత్స్య సంపద అభివృద్ధిలో కీలకపాత్ర వహించాలని అన్నారు. మహిళా మత్స్యకారులకు ప్రభుత్వం సబ్సిడీపై స్కూటర్లను అందిస్తుందని పేర్కొన్నారు. మత్స్యకారులు అందరు జిల్లా మత్స్య సంపద అభివృద్ధిపై దృష్టి పెట్టి, లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకొండ,సాలూరు డివిజనల్ మత్స్య శాఖ అధికారులు,పార్వతీపురం మత్స్యకార మహిళా సంఘ అధ్యక్షురాలు రాజు, ట్రైబల్ సంఘ నాయకులు చిన్నారావు, మత్స్యకార సంఘ నాయకులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

కలుపు మొక్కలు నివారణతో అపరాలు అధిక పంట దిగుబడి

బాడంగి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

అపరాలు పంటలో కలుపు మొక్కలు నివారణ చేయడం ద్వారా అపరాలు అధిక పంట దిగుబడి వస్తుందని రేజేరు వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ అన్నారు గురువారం ఎం ఏ ఓ కే శిరీష ఆదేశాల మేరకు పినపెంకి గ్రామంలో అపరాలు పంటలో కలుపు మొక్కలు నివారణ చేయడంపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు సిఫార్సు చేయబడిన కలుపు మందులు వినియోగించి కలుపునిర్మూలన తప్పనిసరిగా చేయాలనీ ఆయన అన్నారు వరి తరువాత సాగు చేసే అపరాలు పంటలో కలుపుమొక్కలుసకాలంలో సిఫార్సులు మేరకు కలుపు మందులు వాడి కలుపు నివారణ చేసుకున్నట్లు ఐతే దాదాపు ఎకరానికి 60 నుండి 80కిలోలు అపరాలు దిగుబడి పెరుగుతుంది అని తెలిపారు రైతులు చొక్కాపు చిన్నం నాయుడు, చొక్కాపు సత్యనారాయణ రెండు ఎకరాలు పొలంలో ఫోమేస ఫేన్11.1% ఫ్లూయజిఫోప్ పి బ్యూటైల్ 11.1% అనే మందు ఎకరానికి 500 ఎం ఎల్ చొప్పున పిచికారీ చేపించడం జరిగింది దీని వల్ల గడ్డి జాతి, ఆకు జాతి కలుపు సమర్థవంతగా నివారించబడుతుంది అని ఆయన తెలియజేశారుఅనంతరం రేజేరు లో సస్య రక్షణ చర్యలు లో భాగంగా మొదటిదఫా ఆకులు మీద కన్నాలు, ఆకు చిత్త నివారణనకు మోనోక్రోటోఫాస్ 1.6 ఎం ఎల్ లీటర్ నీటికి లేదా క్లోరోపైరిఫాస్ 2 ఎమ్మెల్ ఒక లెటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవడం వల్ల మొదటి 45రోజుల్లో వచ్చే పురుగులుని సమర్థవంతంగా నివారించవచ్చు అని తెలిపారు దీనితో పాటు 19-19-19 లీటర్ నీటికి 5గ్రాములు చొప్పునపై మందు లతో చేసుకోవడం వల్ల పంట ఎదుగుదల బాగుండి,పోషకాలు అంది దిగుబడి పెరిగే ఆస్కారం కలదు అని తెలియజేశారు.

వీడివీకెల్లో గిరిజనోత్పతుల నాణ్యత తగ్గ రాదు

: ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

సీతంపేట. నవంబర్ 21, మేజర్‌న్యూస్

ఐటీడీఏ పరిధిలో ఉన్న వీడివీకేలను బలోపేతం చేయుటకు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం వెలుగు ఏపీఎంలతో నిర్వహించిన సమావేశంలో పీవో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పివో మాట్లాడుతూ వీడివీకేల్లో చేపడుతున్న గిరిజన ఉత్పత్తులను పెంచాలని ఆయన అన్నారు. అదేవిధంగా ఆ గిరిజన ఉత్పత్తులను మార్కెటింగ్ చేయుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడివీకేల్లో ఉత్పత్తి చేసిన గిరిజన ఉత్పత్తులలో నాణ్యత తగ్గకూడదని అన్నారు. సంవత్సరం పొడుగునా వీడీవీకేలో వివిధ ఉత్పత్తులు ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఏపీవోజి.చిన్నబాబుమాట్లాడుతూమూసివేయబడిన వీడీవీకేలను మరల తెరిచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీడీవీకేల ద్వారా ఆర్గానిక్ ఉత్పత్తులనుఉత్పత్తిచేసేలాప్రోత్సహించాలన్నారు. ఐటీడీఏ ద్వారా మైక్రో ప్రాజెక్ట్ రుణాలను ఇచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన స్త్రీనిధి రుణాలను రికవరీ చేయాలని అన్నారు. వీడీవీకేల్లో అన్ని రకాల రిజిస్టర్లు పాటించాలని సూచించారు.

అక్రమ కట్టడాలుపై ఎండోమెంట్ అధికార్లు ఆకస్మిక తనికీ

కొత్తూరు, నవంబర్ 21, మేజర్‌న్యూస్



కొత్తూరు మండలం కర్లెమ్మ రెవిన్యూ పరిధి సర్వే నంబర్ 202/5 లో పాలకొండ హద్దుబంగి రహదారి ప్రక్కన అక్రమ కట్టడాలను దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయిక్ ఆధ్వర్యంలో అధికార్లు ఆకస్మికంగా తనికీచేశారు. దేవాదయ శాఖ స్థలం లో కొవ్వాడి ప్రభాకరరావు అనేవ్యక్తి ఇల్లు అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని,ఎండోమెంట్ అధికార్లు తెలిపారు. దీనిపై ఎటువంటి చర్యలు గాని, నిర్మాణం చేపట్టారాదనీ న్యాయస్థానం స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చిన ప్రభాకరరావు అక్రమంగా ఇల్లు కడుతున్నారని తనికీలో వెళ్ళడైందని అధికార్లు వెల్లడించారు.తనికీ సమయంలో ప్రభాకరరావు నుండి ఇల్లు పనులు చేపట్టకుండా ఉండేందుకు వ్రాతపూర్వకంగా స్టేట్ మెంట్ తీసుకొన్నట్లు అధికార్లు వెల్లడించారు.దేవాదాయ స్థలం లో నిర్మాణాలు చేపట్టారాదనీ అధికార్లు బోర్డులు పెట్టారు. ఈ తనికీల్లో సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయిక్ , ఇన్స్పెక్టర్లు ప్రసాద్ బాబు, వెంకటరమణ , శ్రీముఖలింగం ఇ ఓ ప్రభాకరరావు ,ఎండోమెంట్ సర్వేయర్ దుర్గాప్రసాద్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, వి ఆర్ ఓ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 25 50 కోట్లు పని దినలే లక్ష్యం

– ఉపాధి పథకం స్టేట్ డైరెక్టర్ వై వి కే షణ్ముఖ కుమార్

రామభద్రపురం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

ఈ ఏడాది రాష్ట్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో 25 50 కోట్లు పనిదినాలు కల్పనా లక్ష్యమని ఉపాధి పథకం స్టేట్ డైరెక్టర్ వై వి కె షణ్ముఖ కుమార్ తెలిపారు. మండలంలో కొట్టక్కి కాకర్లవలస తారాపురం దుప్పలపూడి గ్రామాల్లో దోమ పిడి కళ్యాణ్ చక్రవర్తి తో పాటు ఉపాధి హామీ పనుల పరిశీలించారు. శుక్రవారం ఎమ్మెస్ ఈ జి ఎస్ ఆర్ సెంట్రల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫీస్ గుప్తా పర్యట నుంచి నందన మండలం జరుగుతున్న ఉపాధి హామీ నాణ్యతను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు రైతు కూలీలు ఇతర ప్రాంతాలకు వలస లువెళ్లకుండా పనులు కల్పిస్తున్నామని కూలీలకు అదనపు వేతనాన్న ఆశించి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కనీస వేతన కింద రోజుకు క్యూబిక్ మీటర్ పనికి 200నుంచి 250వరకు వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. అలాగే ఉపాధి కూలీ లకు ఉపాధి పనులు పై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. జాతీయ ఉపాధిహామీపథకం పనిచేస్తున్న కూలీలకు కేంద్రం ప్రభుత్వం ఇన్ మేనేజర్ యాప్ తీసుకొచ్చినందుకు ఈ యాప్ ద్వారా సమగ్ర వివరాలు తక్షణమే తెలుసుకోనందుకు వీలుం టుందని అన్నారు. ఇప్పటివరకు కూలీలకు ఏ సమాజం కావాలన్నా ఎంపీడీవో కార్యాల చుట్టూ తపాల కార్యాల చుట్టూ ప్రదక్షి ణ చేసే వారిని ఇకనుంచి ఆ అవసరం ఉండదని అన్నారు. సెల్ ఫోన్ ఉన్న వారందరూ ఇక్కడ నుంచి సమగ్రంగా వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, ఏపీవో తినాధరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా అప్పులుపై అన్ని అబద్ధాలు

: మాజీ ఎమ్మెల్యే శంభంగి

రామభద్రపురం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలు సాక్షిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పాటు ఆయన మంత్రులు గత ప్రభుత్వంపై అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే శంభంగి వెంకట చిన్నప్పలనాయుడు మండిపడ్డారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో ఎంపీపీచొక్కాపు లక్ష్మణరావు తో కలిసి గురువారం ఆయన విలేకరితో మాట్లాడుతూ గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం అప్పులపై చంద్రబాబు ఒక మాట మంత్రులు ఒక్కొక్క తప్పుడు ప్రసారం చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ప్రజా సమస్యను పక్కన పెట్టి గత ప్రతిపక్షం పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం అన్ని అబద్ధపు మాటలని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిమళ్ళిస్తున్నారని విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారం కూడా వచ్చిన చంద్రబాబు అమలుచేయకుండా విద్యార్థులను, మహిళను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ఉన్నత ఆశయాలతో పరిపాలన సాగించారని పేద విద్యార్థులు బంగారు బాటలు వేశారని చెప్పారు . భీమా గాలికి వదిలేసారని రైతులకు రైతు భరోసా కింద 20 రూపాయలు ఇస్తామని చెప్పి ఒక రూపాయి కూడా ఇవ్వలేదని మరోవైపు తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు ఎన్నికల్లో చెప్పిన హామీ టిడిపి ప్రభుత్వం ఎగ వేసిందని విమర్శించారు సూపర్ సిక్స్ అమలు చేయకుంటే ప్రజలు నిలదీసే సమయం ఆసన్నమైందని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే దెప్పుడో

- ధాన్యం కొనుగోలు లేక రైతులు ఆందోళన

తెర్లాం, నవంబర్ 21, మేజర్‌న్యూస్

గత పది రోజులుగా రైతులు వరి నూర్పులు జరిపి ధాన్యం బస్తాలు కి పోసి ఆరు బయట ఉండిపోవడంతో కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభం అవుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తె ర్లాం లో సుమారు 20నుంచి25 వరకు ధాన్యం మిల్లులు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికీ ప్ర భుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంవలన ధాన్యం ఏం చేయాలి అని తమ ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. కోతలు జరిపి నూర్పులకు సమాయత్తం అవుతున్నా ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు గాని అందుకు సంబంధించి ఉద్యోగ సిబ్బంది నీ గాని ఏర్పాటు చేయక పోవడం దురదృష్ట కరమని రైతులు తమ విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంత మంది దళారీ వ్యాపారస్తులు గోనె సంచులు పట్టుకొని రైతుల దగ్గరకు వెళ్లి తమకు ధాన్యం అమ్మకాలు జరపండి. క్వింటా ధర 2200 అంటూ వెళుతున్నట్టు సమాచారం. కొంత మంది రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం వలన ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల జిల్లాలో జిల్లా జాయింట్ కలెక్టర్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నప్పటికీ మండల పరిధిలోని కేంద్రాలు ఏర్పాటు చేయక పోతే ఎలా అని పలు గ్రామాల రైతులు తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.సచివాలయంలో పని చేస్తున్న వ్యవసాయ సిబ్బంది నీ అడిగితే ఏమో మా కేమి తెలుసు.. ఇంతవ ర కు మాకు ఎలాంటి సమాచారం గాని సిబ్బంది గాని రాలేదు. మరి ఎప్పుడు ప్రారంభం అవుతాయో మాకు తెలియదని వారు చెబుతున్నట్టు రైతులు అంటున్నారు. ఇదిలాఉంటే ఈ నెల 26,27 తేదీలలో మరో తుఫాన్ రాబోతున్నట్టు కొంత సమాచారం రావడం వలన మరింత ఆందోళన కలిగిస్తుంది అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

మహిళల రక్షణపై గ్రామస్తులకు అవగాహన: సీఐ

టెక్కలి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా మండలంలో స్థానిక సీతాపురంలో గురువారం గ్రామస్తులకు రహదారి భద్రతపై, మహిళల రక్షణపై, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలుపై, అవగాహన కార్యక్రమాన్ని సీఐ అంబటి విజయ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ప్రతి ఒక్కరూ రహదారి భద్రతలు పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ కు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. అలాగే చైన్స్ స్నాచింగ్, సైబర్ మాసాలు ఈమధ్య ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలు సేవించడం ఆరోగ్యానికి హానికరమని. అదేవిధంగా ఎవరైనా ఇటువంటి మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయడం కూడా చట్టరీత్యా నేరమని సీఐ విజయ్ కుమార్ తెలిపారు. ఇలా మరికొన్ని వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట ఎమ్మెల్యే తీరుపై వైయస్సార్ సీపీ నాయకుల ధ్వజం

పోలాకి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు వెల్లివేయడం ఎమ్మెల్యేకు తగదని.. వాస్తవాలు నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు , పోలాకి ఎంపీపీ దమయంతి బైరాగి నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావులు దుయ్యబట్టారు. గురువారం సాయంత్రం పోలాకి పార్టీ కార్యాలయంలో వీరు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అసెంబ్లీలో వంద పడకల ఆసుపత్రిని తానే అభివృద్ధి చేసినట్టు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ చొరవతో నరసన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను వంద పడకల ఆసుపత్రిగా రూపుదిద్దుకొందని.. అలాగే ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు కూడా కేవలం ధర్మాన కృష్ణ దాస్ చలవేనని వీరు చెప్పుకొచ్చారు. అలాగే క్రీడల కోటగా ఉన్న నరసన్నపేటలో ఇండోర్ స్టేడియం అవసరమనే ఆలోచన కూడా కృష్ణదాస్ దేనని.. తదుపరి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి పూర్తిస్థాయి నిధులు.. బిల్లులు మంజూరు కూడా కృష్ణ దాస్ ఎంతో కృషి చేశారనే విషయాన్ని మర్చిపోయి మాట్లాడడం సరికాదన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే అబద్ధాలు చెప్పినంత మాత్రాన అవి నిజమైపోవని.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు కళ్ళకు కట్టినట్టు కనబడుతున్నాయని వేరు చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలని వీరు హితువు పలికారు.

పి హెచ్. సి. ని సందర్శించిన ఎంపీడీవో

మెలియాపుట్టి, నవంబర్ 21, మేజర్‌న్యూస్

రోగులకు అందుబాటులో ఉండి సక్రముగా వైద్య సేవలు అందించాలని ఎంపీడీవో .పి .నరసింహ ప్రసాద్ అన్నారు. గురువారం మెలియాపుట్టి పీహెచ్సీ ని సందర్శించారు. పి హెచ్ సి లో మందుల వివరాలు, సిబ్బంది వివరాలు , తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు డాక్టర్ అలేఖ్య,సీనియర్ అసిస్టెంట్ తిరుపతిరావు, జూనియర్ అసిస్టెంట్ మురళి ,వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆధార్ అప్డేట్ కేంద్రాలను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి

నరసన్నపేట, నవంబర్ 21, మేజర్‌న్యూస్

నరసన్నపేట పట్టణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ అప్డేట్ సెంటర్లను మండల ప్రత్యేక అధికారి అనురాధ సందర్శించారు. నరసన్నపేట పట్టణంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ అప్డేట్ కేంద్రాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు అందజేశారు. విద్యార్థుల ఆధార్ అప్డేట్ పూర్తి చేయాలని అపార్ అనుసంధానములో ఉన్న పరిష్కరించుకోవాలని సూచించారు. అపార్ 100% పూర్తి అయ్యేందుకు అవస రమైన చర్యలు ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపల్స్ చేపట్టాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో మండల విద్యాశాఖ అధికారులు మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కళావేదిక కవిత పోటీల్లో రమణబాబు ప్రతిభ

నరసన్నపేట, నవంబర్ 21, మేజర్‌న్యూస్

ఐ.ఎస్.ఓ. గుర్తింపు పొంది ఎన్నో ప్రపంచ రికార్డులు సాధించిన తొలి తెలుగు సాహితీ సంస్థ శ్రీశ్రీ కళా వేదిక నిరంతర సాహిత్య సాంస్కృతిక ప్రభంజనంలో భాగంగా బాలల దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయిలోఅంతర్జాలం ద్వారా బాల్యం అనే అంశంపై నిర్వహించిన కవితలు పోటీలో నరసన్నపేటకు చెందిన ఉదండ్రావు రమణబాబు టాప్ 20లో విజేతగా నిలిచారు. శ్రీశ్రీ కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ , జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి రమణబాబును అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు.

కాళ్ళ గణపతిని పరామర్శించిన తిలక్

కోటబొమ్మాళి, నవంబరు 21, మేజర్‌న్యూస్

ఇటీవల రోడ్డు ప్రమాధంలో గాయపడిన మండలం కన్నేవలస మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాళ్ళ గణపతికి గురువారం టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.తన నుంచి ఎలాంటి సహాయం కావాలన్న అందిస్తానని త్వరగా కోలుకొని పార్టీకి సేవలు అందించాలని గణపతికి తిలక్ కోరారు. ఈ కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుమూరు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

కోటబొమ్మాళి, నవంబరు 21, మేజర్‌న్యూస్



గత 14 వారాలుగా పొలంబడి కార్యక్రమం గ్రామాల్లో నిర్వహించి ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించటం జరిగిందని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.వి . తిరుమలరావు అన్నారు. చివరిరోజుగా గురువారం మండలం ఎత్తురాళ్లపాడులో మండల వ్యవసాయ అధికారి ఎస్. గోవిందరావు అధ్వర్యంలో పొలంబడి క్షేత్ర దినోత్సవంను జరుపుకొని రైతులకు గతంలో వ్యవసాయ అధికారులు తెలియజేసిన విషయాల పై ఎంతవరకు అవగాహన పొందారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సనపల గుర్రయ్య, వ్యవసాయ సిబ్బంది, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

29న చలో శ్రీకాకుళం సభను విజయవంతం చేయండి

కోటబొమ్మాళి, నవంబరు 21, మేజర్‌న్యూస్



ఎస్సీ రిజర్వేషన్‌లు, దాడులకు నిరసనగా ఈనెల 29వ తేదీన చలో శ్రీకాకుళం సభను, ర్యాలీని జయప్రదం చేయాలని కోటబొమ్మాళి ఎస్సీ రిజర్వేషన్స్ వ్యతిరేక పోరాట సంఘం సభ్యులు సామ సంజీవరావు అన్నారు. ఆయన గురువారం పలువురు సంఘ నాయకులతో కలిసి మండల పరిషత్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ సభకు సంబందించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈనెల 29న దళిత నాయకులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరు అయి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అయనతో పాటు పలువురు దళిత సంఘ నాయకులు ఉన్నారు.

వివాదాస్పద స్థలంలో నిర్మాణాలు అడ్డుకున్న అధికారులు

-ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆక్రమణలు యధాతధం- ప్రభుత్వాలు మారిన తీరు మారని అధికారుల తీరు

నరసన్నపేట, నవంబర్ 21, మేజర్‌న్యూస్

నరసన్నపేట మేజర్ పంచాయితీ పరిధిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. స్థానిక లక్ష్మీ థియేటర్ ఎదుట వివాదాస్పద స్థలములో గత కొద్ది రోజులుగా జరుగుతున్న షెడ్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితము ఆ స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులు ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించినప్పటికీ, ఆ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తులు బుధవారం రాత్రి నుండి రేకు షెడ్ నిర్మాణం శరవేగంగా పూర్తి చేస్తున్నారు. స్థానికుల నుండి అందిన ఫిర్యాదు/ సమాచారము మేరకు గురువారం సాయంత్రం ఆ ప్రాంతాన్ని పరిశీలించిన నరసన్నపేట తహసిల్దార్, మేజర్ పంచాయతీ ఈవో నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని, షెడ్ నిర్మాణం పనులు కోసం వేసిన రేకులు తీసివేయాలని సూచించారు. అక్కడ ఎటువంటి తొలగింపు ప్రక్రియ కూడా జరగడం లేదు. నరసన్నపేట పట్టణంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలో, చెరువుల ఆక్రమణలోనూ, అనుమతి లేని నిర్మాణాలు కొనసాగుతుండడంలోనూ, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.అక్రమ నిర్మాణాల వ్యవహారంలో నరసన్నపేటలో వింత పరిస్థితి కానవస్తుంది. అధికారులు వచ్చినప్పుడుఆ ఒక్కరోజు ఆగుతున్న పనులు మళ్లీ కొనసాగుతూ ఉంటాయి. పగటి సమయానికంటే రాత్రి సమయాల్లో నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. నరసన్నపేట మేజర్ పంచాయతీ అక్రమ నిర్మాణాలకువేదికగా మారిందని,ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆక్రమణలు మాత్రం ఆగడం లేదని, ప్రభుత్వ ఆస్తులను రక్షించవలసిన అధికారులు, రాజకీయ ప్రతినిధులు ఆక్రమణదారులకు సహకరిస్తూ అక్రమ నిర్మాణాలకు బాసటగా నిలుస్తున్నారని నరసన్నపేట వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాతపట్నం" నియోజకవర్గాన్ని అన్నివిధాలా ఆదుకోండి"

– ముఖ్యమంత్రి చంద్రబాబును కలసిన పాతపట్నం :ఎమ్మెల్యే మామిడి –వలసలు లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి –ఎత్తి పోతల పథకాలు మరమ్మతులు చేపట్టాలని కోరిన ఎమ్మెల్యే –వంశధార నిర్వాసితుల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

కొత్తూరు, నవంబర్ 21, మేజర్‌న్యూస్

శ్రీకాకుళం జిల్లాలో ఆర్థికంగా, అభివృద్ధి పరంగా వెనుక బడిన పాతపట్నం నియోజకవర్గాన్ని అన్నివిధాల ఆదుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విజయవాడ లో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలసి వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. శాసన సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా వంశధార నిర్వాసితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ని ఎమ్మెల్యే గుర్తు చేశారు.వెనుకుబాటుకు గురైన నియోజకవర్గాన్ని అత్యధిక నిధులిచ్చి, నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే గోవిందరావు కోరారు.నియోజకవర్గంలో ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్నాయని కొన్నిచోట్ల ఎత్తిపోతల పథకాలు, పాత వాటికి మరమ్మత్తులు కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసారు.ఏపీ లో అత్యంత వేనుకుబాటు గురైన పాతపట్నం నియోజకవర్గంలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి కలుగుతుందని అన్నారు.జిల్లాలో అధిక శాతం మంది జీవన భృతి లేక పొట్ట కూటి కోసం పాతపట్నం నియోజక వర్గంనుండే ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని వాటిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గోవిందరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని కోరారు.తమ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి శానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలియజేసినట్లు ఆయన కార్యాలయం తెలిపింది.

ఎక్కడ నుంచో వచ్చిన వారిని ఎమ్మెల్యే చేశాం

గెలిచిన తర్వాత ఎమ్మెల్యే మిత్ర ధర్మం పాటించడం లేదు- 80 శాతం టిడిపి వారిని పక్కన పెట్టి జనసేన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అధికారులపై మండిపాటు - గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను కూడా అధికారులు ఎమ్మెల్యే కను సన్నల్లోనే చేస్తున్నారు- అధికారులు కూడా కూటమి ధర్మాన్ని పాటించి తెదేపా వారికి గౌరవం ఇవ్వాలి- అధికారులు తీరు మార్చుకోకుంటే ధర్నా చేసేందుకు కూడా సిద్ధమని హెచ్చరించిన నాయకులు

పూసపాటిరేగ, నవంబర్ 21, మేజర్‌న్యూస్

మేమేమీ ప్రతిపక్షంలో లేము. కూటమి ప్రభుత్వంలో అధికారుపక్షంలో ఉన్నాం. మా అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగా, మంత్రులు కూడా ఉన్నారన్న విషయాన్ని అధికారులు మరిచిపోవద్దు. కూటమి ప్రభుత్వంలో మిత్ర ధర్మాన్ని పాటించి ఎక్కడ నుంచో వచ్చిన వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాం. అయినప్పటికీ తమను పక్కన పెట్టేసి జనసేన నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అధికారులు కూడా ప్రతి చిన్న విషయాన్ని ఎమ్మెల్యే చెబితే గాని చేయడం లేదు. ఇదే సంప్రదాయాన్ని అనుసరిస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నాం. ఇది పూసపాటిరేగ మండలానికి చెందిన తెదేపా నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాధిక, వివిధ శాఖల అధికారుల తీరుపై వ్యక్తం చేసిన ఆక్రోసం. మండలానికి చెందిన తెదేపా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తెదేపా జిల్లా మాజీ అధ్యక్షులు మహంతి చిన్నం నాయుడు, తెదేపా మండల అధ్యక్షులు మహంతి శంకరరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ఎంపీడీవో రాధిక, వివిధ శాఖల అధికారులను కలిసి కూటమి ప్రభుత్వంలో మిత్ర ధర్మాన్ని విస్మరించి తమకు జరుగుతున్న అన్యాయాన్ని నాయకుల అధికారుల వద్ద తమ ఆక్రోసాలను వ్యక్తం చేశారు. 80 శాతం ఉన్న తెదేపా వలనే జనసేన కు చెందిన ఎమ్మెల్యే గెలిచారన్న విషయాన్ని మరిచిపోవద్దని, అటువంటి ఎమ్మెల్యే తెదేపా ప్రమేయం లేకుండానే ఉపాధి హామీ పనులు తమ వారిని పక్కన పెట్టి జనసేన కు చెందిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఎందుకో అధికార యంత్రాంగం కూడా ఎమ్మెల్యేకు పూర్తిగా సహకారం అందించడం భావ్యం కాదంటూ అధికారులకు తెదేపా మాజీ జిల్లా అధ్యక్షులు మహంతి చిన్నం నాయుడు హితువు పలికారు. ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనులపై పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి పంచాయతీ తీర్మానాలు చేశారని, ఆ తీర్మానాలను పంచాయితీలు ఆమోదించినప్పటికీ, ఆమోదించిన పనులను పక్కన పెట్టి గ్రామాల్లో ఉన్న జనసేన కు చెందిన వారికే పనులు కట్టబెట్టి కార్యకర్తలకు ఉనికే లేకుండా చేశారంటూ నాయకులు మండిపడ్డారు. ఆమోదించిన పంచాయతీ తీర్మానాలను పక్కన పెట్టి ఎమ్మెల్యే చెప్పిన అభివృద్ధి పనులు ఎలా ప్రాధాన్యం ఇచ్చారంటూ ఎంపీడీవో రాధిక పై నాయకులు అసహనం వ్యక్తం చేశారు. అటువంటప్పుడు గ్రామ సభలు పెట్టడం ఎందుకు తీర్మానాలు చేయడం ఎందుకు అంటూ అధికారుల తీరును నాయకులు తప్పు పట్టారు. కూటమి పక్షాన గెలిపించిన ఎమ్మెల్యేను ప్రభుత్వం నుంచి గ్రాంట్లు వచ్చినప్పుడు తమకు చెప్పాల్సిన అవసరం లేదా అంటూ అధికారుల వద్ద ఎమ్మెల్యే లోకం మాధవి వ్యవహార శైలపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విభజించు పాలించాడు నా పద్ధతిలో ప్రజల్లో భిన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని ఇది మంచి సాంప్రదాయం కాదంటూ నాయకులు అధికారుల వద్ద నిస్సహాయత వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కూడా ఎమ్మెల్యే రాజకీయం చేస్తున్నారని, ఎమ్మెల్యే కను సన్నల్లోనే అధికారులు వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అంటూ ఎంపీడీవో రాధికను ప్రశ్నించారు. గ్రామాలకు చెందిన కొన్ని విషయాలను అధికారులే తీసుకోవలసి ఉంటుందని, అటువంటి చిన్న సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టిలో పెట్టి అధికారులు కూడా రాజకీయం చేస్తే పాము కూడా న్యాయపోరాటం చేయవలసి ఉంటుందంటూ ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ప్రసాదరావు, విక్రమ్ జగన్నాథం, సన్యాసినాయుడు, పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరి మాటేంటి..?

– ఉపాధి హామీ పనుల్లో తమకు ప్రాధాన్యం కల్పించాలన్న వైకాపా